
GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
# టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్
సంపుటి : 7 సంచిక : 53 ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ శుక్రవారం : అక్టోబర్-25-2024 పేజీలు : 3




# కేంద్ర కేబినెట్ లో ఏపీకి వరాలు..

- ఎర్రుపాలెం నుంచి అమరావతికి కొత్త రూట్
- 57 కిలోమీటర్ల లైన్ నిర్మాణానికి రూ.2245 కోట్లు వ్యయం
- కృష్ణానదిపై 3.20 కిలో మీటర్ల రైల్వే వంతెన నిర్మాణం

**టీ మీడియా, అక్టోబర్ 24,అమరావతి :** ఈ రైల్వే లైన్‌తో దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అనుసంధానం మరింత సులువు కానుంది. అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమరలింగేశ్వరస్వామి ఆలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు వెళ్లే వారికి సులువైన మార్గంగా అభివృద్ధి చేయనున్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను అనుసంధానిస్తూ ఈ రైల్వేలైన్ ఏర్పాటు కానుంది.ఏపీ, బిహార్ రాష్ట్రాలకు రెండు రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి అంచనా వ్యయం మొత్తంగా రూ.6,798 కోట్లు. ఇందులో అమరావతి రైల్వే లైన్‌కు రూ.2,245 కోట్లు కాగా.. బిహార్‌లో రైల్వే లైన్‌కు రూ.4,553 కోట్లు కేటాయించింది.

**అమరావతి మీదుగా ఎర్రుపాలెం ..**

అంతరిక్ష రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఐఎన్-స్పేస్ ఆధ్వర్యంలో రూ.1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఫండ్ దాదాపు 40 స్టార్టప్‌లకు తోడ్పాటు అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అంతర్జాతీయంగా పోటీతత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ప్రోత్సహం కల్పించేలా ఈ నిధి ఉపయోగపడనుంది.బిహార్‌లో రూ.4,553 కోట్లతో నర్కతియా గంజ్-రక్సాల్-సీతామర్హి-దర్భంగాబీ సీతామర్హి-ముజఫర్ పుర్ కారిడార్ డబ్లింగ్‌కు పనులు చేపట్టనున్నారు. మొత్తంగా 256 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టుతో ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్‌లకు ప్రయోజనం చేకూరనుంది. నేపాల్ అంతర్జాతీయ సరిహద్దుకు సమాంతరంగా కొనసాగే ఈ రైల్వే లైన్.. కాఠ్‌మాండూ, జానక్‌పుర్, లుంబినీ మధ్య ఆహార ధాన్యాలు, ఎరువులు, సిమెంట్, కంటెయినర్లను వేగంగా తరలించేందుకు ప్రత్యామ్నా యంగా ఉండనుంది.ఏపీ, బిహార్‌లలో చేపట్టే ఈ ప్రాజెక్టులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు.అలాగే అన్ని ప్రదాన రైళ్లు అమరవతి మీదుగా ప్రయాణించేలా చర్యలు చేపడుతున్నారు.. ఇక ఈ కేబినేట్ లో వచ్చే నెల ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలపై చర్చించారు.. ఈ సెషన్లో ప్రవేశ పెట్టనున్న కొన్ని బిల్లుకు కేబినేట్ ఆమోద ముద్ర వేసింది.



కేంద్ర కేబినెట్ లో ఏపీకి వరాలు కురిపించారు.. ప్రదాని మోడీ అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో జరిగిన కేబినేట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.. ముఖ్యంగా అంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాజెక్ట్ లకు మోడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.. అమరావతి రైల్వే లైన్ ను మంజూరు చేసింది. విజయవాడ, గుంటూరు, తెనాలి మార్గాన్ని అనుసందానిస్తూ అమరావతి రైల్వే లైన్ ను నిర్మించనున్నారు..ఇక ఎర్రుపాలెం కృష్ణా నదిపై రైలు వంతెన నిర్మించేందుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.. మొత్తం 3.2 కిలోమీటర్ల రైల్వే వంతెన తో పాటు 57 కిలోమీటర్ల రైల్వే లైన నిర్మాణ కోసం రెండు వేల 245 కోట్లు ఖర్చు చేయనున్నారు.. ఈ రైల్వే లైన్ ఏర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్నారు.

# సింగరేణి కార్మికుల బోనస్ విడుదల

- గత ఏడాది కన్నా ఇది రూ. 50 కోట్లు అధికం
- ఒక్కొక్క కార్మికునికి రూ.93,750 చెల్లింపు
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

**టీ మీడియా, అక్టోబరు 24, హైదరాబాద్ :** దీపావళి బోనస్ గా పిలవబడే పి.ఎల్.ఆర్.ఎస్. (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్) బోనస్ ను నేటి నుంచి సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం సచివాలయంలో ప్రకటించారు.దీని కోసం సింగరేణి సంస్థ 358 కోట్ల రూపాయలను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. రేపటి మధ్యాహ్నం నాటికి దీపావళి బోనస్ ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750 లు అందుకోనున్నారు.దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు వర్తిస్తుంది. జే.బీ.సీ.సీ.ఐ. విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్ ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా భట్టి ఆదేశాలిచ్చారు.



**బోనస్ తో కలిపి రూ.1250 కోట్ల చెల్లింపులు**

కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద 796 కోట్ల రూపాయలను కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున 1 లక్షా 90 వేల రూపాయలు అందాయి. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించారు. అలాగే పండుగ అడ్వాన్స్ కింద ఒక్కొక్క కార్మికునికి 25వేల రూపాయలు చొప్పున మరో 90 కోట్ల రూపాయలను కంపెనీ చెల్లించింది. ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.93,450లు లభిస్తాయి. మొత్తమ్మీద ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ.1250 కోట్ల ను కంపెనీ చెల్లించింది. ఈ విధంగా సగటున సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల రూపాయల వరకు అందుకున్నారు.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్ బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాటు చేయాలని ఆయన పర్సనల్ మరియు ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ బోనస్ డబ్బులను దుబారా చేయవద్దని, ప్రభుత్వ పొదుపు సంస్థల్లో దాచుకోవాలని లేదా కుటుంబ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తగా వెచ్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 10 మంది వచ్చి మాపై పెత్తనం చేస్తారా..?

## -ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**టీ మీడియా, అక్టోబర్ 24,జగిత్యాల :**లో పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ నేతలు కత్తులు దూసుకుంటున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్ అవుతున్నారు. తనకు తెలియకుండా ఆయనను పార్టీలో చేర్చుకున్నారని ఇప్పటికే అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఎమ్మెల్సీ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. శాసనసభలో సంఖ్యను పెంచుకోవడం కోసం ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవడం సరికాదంటూ పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే.. గురువారం కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మెజార్టీ ఇచ్చి గెలిపించినా ఫిరాయింపుల అవసరం ఏముందన్నారు. 10మంది ఎమ్మెల్యేలు వచ్చి తమపై పెత్తనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంపగుత్తగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఫిరాయింపులకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపునిచ్చారన్నారు. నైతికవిలువలను కాపాడేలా పార్టీ పనిచేయాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా తాను పోరాడటం లేదని.. కాంగ్రెస్ విధానాలను మాత్రమే గుర్తుచేస్తున్నట్టు జీవన్ రెడ్డి తెలిపారు. లోసుగులను వాడుకుని పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించడం సరికాదన్నారు. క్రమశిక్షణతో ఉన్న తమకు అన్యాయం చేస్తారా? అంటూ ప్రశ్నించారు.అయితే.. బుధవారం కూడా జీవన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సంజయ్ చేరిక స్థానిక కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను గాయపరిచిందన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందేనన్నారు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీలో ఎవరు ఒరిజనల్ కాంగ్రెస్సో ఎవరు బీఆర్ఎస్ కాంగ్రెస్సో తెలియడం లేదన్నారు.జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ ఫిరాయింపులపై జీవన్ రెడ్డి వ్యాఖ్యలను తప్పుబట్టారు. తాను జగిత్యాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానన్నారు. తన కుటుంబానికి మొదటి నుంచి కాంగ్రెస్‌తో అనుబంధం ఉందన్నారు. తాతల కాలం నుంచి కాంగ్రెస్ అంటే తనకు అభిమానం ఉందన్నారు.



# ప్రధాని మోడీతో ఒమర్ అబ్దుల్లా భేటీ


**టీ మీడియా, అక్టోబరు 24,న్యూఢిల్లీ :** జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గురువారం ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. గతవారం జమ్ముకాశ్మీర్ సిఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది అధికారికంగా ఒమర్ అబ్దుల్లా మొదటి ఢిల్లీ పర్యటన. జమ్ముకాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ఆమోదించిన తీర్మానాన్ని ఒమర్ అబ్దుల్లా ప్రధానికి అందించనున్నట్లు సమాచారం.పదేళ్ల తర్వాత జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో 90 అసెంబ్లీ స్థానాలకు గాను నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) 42 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే.



# డ్రగ్స్ కేసులో బీజేపీ నాయకురాలు అరెస్ట్

## - పార్టీ నుంచి బహిష్కరణ

**టీ మీడియా, అక్టోబరు 24,చండీగఢ్:** బీజేపీ నాయకురాలి వద్ద డ్రగ్స్ లభించడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ఆమెపై చర్యలు చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే అయిన ఆమెను ఆరేళ్ల పాటు బీజేపీ నుంచి బహిష్కరించింది. బీజేపీ నాయకురాలు సత్కర్ కౌర్ ఆమె బంధువు జస్కీరత్ సింగ్ బుధవారం హెరాయిన్ తరలిస్తుండగా మొహాలీలోని ఖరార్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. వారిద్దరి నుంచి 128 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.కాగా, డ్రగ్స్ కేసులో సత్కర్ కౌర్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై బీజేపీ స్పందించింది. మాజీ ఎమ్మెల్యే అయిన ఆమెను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి తొలగించింది. పంజాబ్ బీజేపీ చీఫ్ సునీల్ జాఖర్ ఆదేశాల మేరకు సత్కర్ కౌర్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి అనిల్ సరిన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు.మరోవైపు 2017-2022 వరకు ఫిరోజ్‌పూర్ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా సత్కర్ కౌర్ ఉన్నారు.అయితే 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆమెకు టిక్కెట్ నిరాకరించింది. ఈ నేపథ్యంలో సత్కర్ కౌర్ ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు.



# పవార్ కుటుంబంలో ఆధిపత్య పోరు

## -బారామతి పోరులో గెలిచేదెవరు?

**టీ మీడియా, అక్టోబర్ 24ముంబై:**యావత్ దేశం దృష్టిని ఆకర్షిస్తున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ నియోజకవర్గం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోంది. ఇందుకు కారణం పవార్ కుటుంబమే. దేశంలోనే సుదీర్ఘ రాజకీయానభవం కలిగిన నేతల్లో ఒకరైన శరద్ పవార్ బారామతిపై కొన్ని దశాబ్దాలుగా తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. ఎన్నికల్లో వరుసగా గెలుపొందుతూ జాతీయస్థాయి నేతగా ఎదిగారు. రాజకీయ భీష్ముడు శరద్ పవార్‌కు ఈ స్థాయి కల్పించిన బారామతి ఇప్పుడు పవార్ కుటుంబంలోనే ఆధిపత్య పోరుకు తెరతీసింది. కొద్ది నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనే ఈ కుటుంబం నుంచి ఇద్దరు మహిళలు తలపడ్డారు. గత ఐదేళ్లలో చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, ఈ కుటుంబంలోనూ చీలిక తీసుకొచ్చాయి.బారామతి శరద్ పవార్‌కు వరుస విజయాలు అందించి కంచుకోటగా పేరొందింది. శరద్ పవార్ 1967లో తొలిసారిగా ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1962 నుంచి 1990 వరకు వరుసగా 6 పర్యాయాలు శరద్ పవార్ బారామతి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వచ్చారు. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే, పవార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్‌కు శక్తివంతమైన నేతగా ఎదిగారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 'సహకార ఉద్యమం' ద్వారా మరఠ్వాడా, పశ్చిమ మహారాష్ట్రలో బలమైన నేతగా ఎదిగారు. 1991లో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాల్సి వచ్చింది. అప్పుడు తన ఎమ్మెల్యే పదవిని వదులుకుని ఎంపీగా జాతీయ రాజకీయాల్లోకి వచ్చిన శరద్ పవార్, తన కుటుంబానికే చెందిన సోదరుడి కుమారుడు అజిత్ పవార్‌ను బారామతి నుంచి ఎమ్మెల్యేను చేశారు. దేశ రాజకీయాల్లో శరద్ పవార్ చక్రం తిప్పుతున్న సమయంలో అజిత్ పవార్ రాష్ట్రంలో బలమైన నేతగా ఎదిగారు. శరద్ పవార్ రికార్డును అధిగమిస్తూ ఆయన 7 పర్యాయాలు (1991 నుంచి 2019) ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంటే మొత్తంగా 1962 నుంచి ఇప్పటి వరకు పవార్ కుటుంబం ఈ నియోజకవర్గంలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చింది. కానీ ఇప్పుడు ఆ కంచుకోటలోనే అంతర్యుద్ధం మొదలైంది.2024 లోక్‌సభ ఎన్నికల్లో బారామతి పార్లమెంట్ స్థానంలో అజిత్ పవార్ తన భార్య సునేత్ర పవార్‌ను బరిలోకి దించారు. ప్రత్యర్థిగా శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీపీ నుంచి ఆయన కుమార్తె సుప్రియా సూలే పోటీ చేశారు. వరుసకు సోదరైన సుప్రియాపై తన సతీమణిని బరిలోకి దింపడం రాజకీయంగా అజిత్ పవార్‌కు శరాఘాతంగా మారింది. ఈ ఎన్నికల్లో సునేత్ర ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. దీంతో అజిత్ పవార్ చీలిక వర్గం బలం ఎంత అన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఎన్సీపీ ఓటుబ్యాంకులో ఎక్కువ శాతం శరద్ పవార్‌తోనే ఉన్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేశాయి. దీంతో తన తప్పును గ్రహించిన అజిత్ పవార్.. తమ కుటుంబంలో విభజన ప్రజలకు నచ్చలేదని వ్యాఖ్యానించారు. తన పొరపాటును బహిరంగంగానే అంగీకరించి జరిగిన నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నం చేశారు.తాజాగా అజిత్ ఓ ప్రొఫెషనల్ ఏజెన్సీని రాజకీయ వ్యూహకర్తగా నియమించుకున్నట్టు తెలిసింది. ఈ ఏజెన్సీ సలహా మేరకు అజిత్ మరాఠ్‌వాడీ, పశ్చిమ మహారాష్ట్రలో గెలుపు వ్యూహాలపై కసరత్తు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అజిత్ ఈసారి పోటీ చేయకపోవచ్చని చర్చ జరుగుతోంది. తన కుమారుడిని బారామతి నుంచి ఎన్నికల్లో పోటీ చేయించవచ్చు అని ఊహాగానాలు నెలకొన్నాయి. మరోవైపు శరద్ పవార్ తన మనవడు యుగేంద్రను ఇక్కడి నుంచి పోటీకి దింపేందుకు వ్యూహరచన చేస్తున్నారు. యుగేంద్ర ఇక్కడి నుంచి రంగంలోకి దిగితే మళ్లీ ఒకే కుటుంబం తలపడాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అజిత్ వ్యూహాత్మకంగా అడుగులు వేయాల్సి ఉంది.



# అభివృద్ధి కార్యక్రమాలపై గవర్నర్ సమీక్ష

- ఒక్క రోజు పర్యటనకు వచ్చిన జిష్ణుదేవ్ వర్మ
- ఘన స్వాగతం పలికిన మంత్రి ఉత్తమ్
- కవులు, కళాకారులతో సమావేశం

**టీ మీడియా, అక్టోబర్ 24,సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమీక్షించారు. గురువారంజిల్లాలో ఒక్క రోజు పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూర్యాపేట కలెక్టరేట్ వద్దకు ఉదయం పదిన్నర గంటలకు చేరుకున్నారు. తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ లో జరిగే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ రంగాల్లోని రచయితలు, కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలు మాట్లాడారు.




**గవర్నర్‌కు ఘన స్వాగతం**

సూర్యాపేట చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మంత్రి ఉత్తమ్? కుమార్?, అధికారులు ఘన స్వాగతం పలికారు. గవర్నర్ కారుదిగిన వెంటనే రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అలాగే జిల్లా కలెక్టర్ తేజాస్ నందలాల్ పవార్ తో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పుష్ప గుచ్చాలు అందజేశారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ఫోటోలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తిలకించారు. అలాగే అంగన్‌వాడీలు, మహిళ సంఘాలు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాల శిబిరాన్ని ఆయన సందర్శించారు.

**జిల్లా అభివృద్ధిపై సమీక్ష**

సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ తేజాస్ నందలాల్ పవార్ , అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి గురించి తొలుత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. అనంతరం కలెక్టర్ తేజాస్ చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక ఇచ్చారు.

# పచ్చని చెట్లపై గొడ్డలి వేటు...

- తరలిపోతున్న అటవీ సంపద..
- నిర్లక్ష్యం నీడన అటవీశాఖ అధికారులు..

**టీ మీడియా, అక్టోబర్ 24, మహానంది:** నంద్యాల,చలమా రేంజ్ల పరిధిలలోని నల్లమల్ల అడవి ప్రాంతంలో వెదురు అక్రమ రవాణా దారులకు అడ్డు అదుపే లేకుండా పోతోంది. కొందరు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, అక్రమార్కుల చేతులు కలుపడంతోనే దట్టమైన అడవులు మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. కంచె చేను మేసిన చందంగా అధికారుల తీరు కనిపిస్తోంది.అక్రమ రవాణాను అరికట్టాల్సిన సంబంధిత అటవీ అధికారులు చోద్యం చూస్తూ ఉండటంతో లక్షలు విలువైన సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నారు.అటవీ సంపద అక్రమ వ్యాపారులకు మహానంది, చలమ రేంజ్ రాజా మార్గంగా, మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది.చలమ రేంజ్ పరిధిలోని నల్లమల అడవి ప్రాంతం నుంచి అటవీ సంపదను బొలెరో వాహనాల్లో, అక్రమంగా తరలిస్తున్న అడ్డుకునే నాధుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాతావరణం కలుషితం కాకుండా మానావళిని కాపాడుతున్న పచ్చని చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. యథేచ్ఛగా అటవీ సంపద తరలిస్తున్నారు.చలమ రేంజ్ పరిధిలో నలుదిశలా అడవి విస్తరించి ఉండడంతో, ఏదో ఒక ప్రాంతం నుంచి అటవీ సంపద తరలిస్తూనే ఉంటారు.ఎంతో విలువైన అటవీ సంపదను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నా, పట్టించుకునే వారే లేరని స్థానికులు చర్చించుకుంటున్నారు. కేసులు నమోదు చేస్తున్నారో లేదో కానీ, అటవీ



సంపద నరికివేత మాత్రం యథేచ్ఛగా సాగుతోంది.ప్రతి రోజు రాత్రివేళల్లో తెలుగు గంగా కాలువ, మహానంది, బసాపురం తెలుగు కంగా కాలువ,నంద్యాల- గాజులపల్లె జాతీయ రహదారి మార్గాల్లో అటవీ సంపద తరలుతోంది. చీకటి, పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. చేయి తడిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేనిపక్షంలో వేలకు వేలు అపరాధ రుసుం వేసి చేస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. విపరీతంగా అటవీ సంపద నరికివేయడంతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని, వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంటుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. అడవులు కనుమరుగు అవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అడవుల సంరక్షణ అనే కార్యక్రమాలు చేపడుతుంటే, మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా అటవీ సంపద నరుకుతూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది.ఇంటి దొంగలే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.అడిగినంత ఇస్తే అడిగే వారే లేరనట్లుగా అధికారుల తీరు మారింది. ఇక్కడ పనిచేసే కొంతమంది అధికారులు అవినీతిలో పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది.ఈ ప్రాంతంలో జన సంచారం పై పూర్తి గా నిషేధాజ్ఞలు ఉన్న అక్రమార్కులకు ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. యథే చ్ఛగా చలమ రేంజ్ అడవి ప్రాంతంలో చొరబడుతున్న స్మగ్లర్లు అటవి సంపదను కొల్లగొట్టడంతో, పాటు వన్యప్రాణులకు ముప్పును తలపెడుతున్నారు. అయినా జిల్లా ఉన్నతాధికారులు నిస్సాహాయత స్థితిలోనే కనిపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు, అవినీతి అధికారుల ఆగడాలకు అడ్డు లేకుండానే పోతోంది.అవినీతిలో ఆరితేరిన అక్రమార్కుల ఆగడాలు మితిమీరి పోతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. అడిగినంత ఇస్తే సరే, లేదంటే అక్రమార్కులను సైతం ముప్పుతిప్పలు పెడుతున్నట్లు చెబుతున్నారు. అందినకాడికి దండుకోవడం అటవీ శాఖ అధికారులకు అలవాటుగానే మారిందంటున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నత అధికారులు, అటవీ సంపద అక్రమార్కులపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

## వ్యసనాలకు దూరంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

### -జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**టీ మీడియా, అక్టోబర్ 24, వనపర్తి బ్యూరో :** విద్యార్థులు తమ లక్ష్య సాధనకు విద్యార్థి దశ నుండే గొప్ప వ్యక్తులకు సంబంధించిన మంచి బుక్స్ చదవడం అలవర్చుకోవాలని, అలాగే మంచి స్నేహితులను కూడ ఎంపిక చేసుకోవడం అవసరం అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ విద్యార్థులకు సూచించారు. గురువారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ విన్నపం మేరకు పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో జిల్లా ఎస్పీ ఇంటరాక్ట్ సెక్షన్ నిర్వహించి విద్యార్థులకు ఉన్న సందేహాలను తీర్చడం తో పాటు లక్ష్యాన్ని ఎలా చేరాలో పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత విజయాలను అందుకోవడానికి గొప్ప గొప్ప విజయాలు సాదించిన వారి చరిత్రలను , వారికి సంబంధించిన బుక్స్ ను చదవడం అలవర్చుకోవాలని విద్యార్థిగా ఎదిగే క్రమంలో తోటి స్నేహితులను మంచి వారిని ఎంపిక చేసుకోవాలని అన్నారు.లో ఎవరైనాసైబర్ నేరాలకు గురైతే 1930 హెల్ప్ నెంబర్ కు 24 గంటలలో సమచారం అ%శీ%దించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జగన్ నాయక్, మెకానికల్ హెచ్ ఓ డి,శ్యామ్ రావు, కళాశాల అధ్యాపకులు 500 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవస్థానానికి 2 ఎకరాల పొలం, ఇల్లు విరాళం



**టీ మీడియా, అక్టోబర్ 24, మహానంది:** మహానంది దేవస్థానానికి గోపవరం గ్రామానికి చెందిన విశ్రాంత లెక్చరర్ డి.రాజు శకుంతల దంపతులు సుమారు రెండు కోట్ల పైగా విలువ గల 2 ఎకరాల10 సెంట్ల పొలం, 5 సెంట్ల స్థలంలో ఇల్లు రిజిస్ట్రేషన్ పత్రాలను విరాళంగా ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి కి గురువారం అందజేశారు. ముందుగా ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి రెడ్డి, ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. స్వామి అమ్మవాళ్ళను దర్శించుకుని, అభిషేకం కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం విరాళంగా అందజేసిన దాతలను, ఆలయ ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు, ఆలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**టీ మీడియా, అక్టోబర్ 24 ,పెద్ద దోర్నాల:** పెద్ద దోర్నాల . స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని.ఆర్డిటి కమ్యూనిటీ హాల్ నందు.శాంతి రామ్ మెడికల్ కాలేజ్ మరియు జనరల్ హాస్పిటల్ఎర్రగొండపాలెం తెలుగుదేశం ఇంచార్జ్ గూడూరి. ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో.ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శాంతి రామ్ చారిటబుల్ ట్రస్ట్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు.ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో ప్రజలు. రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు. కొంతమంది రోగులను కంటి ఆపరేషన్స్కు ఎంపిక చేసి శాంతి మెడికల్ కాలేజ్ వారు కంటి ఆసుపత్రికి బస్లో తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్యసేవలు అందిస్తున్న శాంతి మెడికల్ కాలేజ్ జనరల్ హాస్పిటల్ మరియు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గూడూరి. ఎరిక్షన్. బాబు టిడిపి నాయకులకు. చారిటబుల్ ట్రస్ట్ బృందాన్ని స్థానికులు అభినందించారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఏరువా. మల్లికార్జు రెడ్డిటి.ఎన్. టి. యు. సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు. సుధాకర్ రెడ్డి. ఎస్సీ సెల్లు నాయకులు. చంటి. మైనార్టీ నాయకులు. షేక్. మంజూర్. తాతిరెడ్డి. తంగిరాల మధుసూదన్ రెడ్డి. హై స్కూల్ ప్రిన్సిపల్ నారాయణరెడ్డి.ఫౌండేషన్ ఆసుపత్రి సిబ్బంది. వివిధ గ్రామాల నుంచి ప్రజలు పాల్గొనడం జరిగింది.

## రాస్తారోకో చేసిన టిఆర్ఎస్ శ్రేణులు



**టీ మీడియా ,అక్టోబర్ 24 ,చిన్నచింతకుంట :** చిన్న చింతకుంట మండల కేంద్రంలో పార్దిపూర్ టిఆర్ఎస్ కార్యకర్తల అరెస్టుకు నిరసనగా మండల రైతులందరూ రాస్తారోకోకు దిగారు. ఈ వానకాలం సీజన్ కు రైతుబంధు ఇవ్వలేమని మూడు రోజుల క్రితం ప్రకటించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలకు నిరసనగా పార్దీపూర్ గ్రామంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఉందని శవయాత్ర చేపట్టిన టిఆర్ఎస్ వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎందుకు నిరసనగా చిన్న చింతకుంట మండల రైతులందరూ మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు, మండల నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర పోలీసు అధికారుల భేటీ

- గడ్చిరోలిలో సమావేశం
- మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో
- మావోయిస్టులను కట్టడి



**టీ మీడియా, అక్టోబర్ 24,గడ్చిరోలి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంత రాష్ట్ర పోలీసు అధికారులు సమావేశమయ్యారు. నవంబర్ 20న జరిగే ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు మహారాష్ట్ర నలువైపులా ఉన్న రాష్ట్రాల పోలీస్ అధికారుల సమావేశం గురువారం గడ్చిరోలిలో నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ నుండి రామగుండం పోలీస్ కమిషనర్, ఐజి శ్రీనివాస్, గడ్చిరోలి డిఐజి అంకిత్ పాండ్యా హాజరై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీస్ అధికారులతో మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కదలికలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాష్ట్రాల సరిహద్దుల్లో ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, ఫేర్రి పాయింట్ల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే రామగుండం కమిషనరేట్ పోలీసులు మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న మూడు లక్షల రూపాయల విలువ గల 300 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు.రామగుండం సిపి శ్రీనివాస్ మాట్లాడుతూ%ౌ% రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు 24 గంటల పాటు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నదితీర ప్రాంతాల్లో నిఘా పెంచాలని, మావోయిస్టుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నుండి ఆసిఫాబాద్, భూపాలపల్లి ఎస్పీ లతో పాటు మంచిర్యాల డీసీపీ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజ్జన్నకు రుణపడి ఉంటాం

### -వెన్నంపల్లి గ్రామ ప్రజలు



**టీ మీడియా ,అక్టోబర్ 24,పెద్దపల్లి బ్యూరో :** పెద్దపెల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామం అనేది శ్రీరాంపూర్ మండలానికి మొదటి గ్రామంగా చెప్పుకుంటారు. పెద్దపల్లి శ్రీరాంపూర్ ప్రధాన రహదారి వెన్నంపల్లి కమాన్ నుండి ముత్తారం గ్రామ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలు ఏర్పడి వర్షాలు కురిసినప్పుడు నీళ్లు నిలిచి మురికి కాల్వలను తలపించే విధంగా ఉండేవి. వాహన చోదకులకు గాని అందరికీ ఇబ్బందిగా ఉండేది. వెన్నంపల్లి గ్రామంలోని కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు గోపగోని సారయ్య గౌడ్ అందరూ కలిసి ఎమ్మెల్యే విజయ రమణరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే స్పందించి వెన్నంపల్లి గ్రామానికి రింగ్ రోడ్డు వేసేందుకు ఏడుకోట్ల నిధులు మంజూరుచేయడం జరిగింది.ఈ సందర్భంగా వెన్నంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు బుధవారం వెన్న%శీ%పల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ తో సహ మండల పార్టీ అధ్యక్షులు గాజన వీణ సదయ్య,ఎం డి మునీర్, మాదాసు సతీష్ అందరూ కలిసి స్వీట్లు పంపిణీ చేసుకొని విజయ రమణారావు కు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## హద్దు రాళ్లు, తోరణం ధ్వంసం..

### -ప్లాట్లను కొనుగోలు చేసిన వారు ఆందోళన



**టీ మీడియా, అక్టోబర్ 24,జనగాం:** జిల్లాలోని పెద్ద రాంచెర్ల గ్రామంలో ఓ ప్రైవేటు వెంచర్లో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ మండలం పెద్ద రాంచెర్ల గ్రామ శివారులో 18 ఎకరాల భూమి ఉండగా.. 12 ఎకరాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం లక్ష్మీనారాయణ ప్లాట్లు చేయడం జరిగింది. ఇందులో సుమారు 300 నుండి 350 వరకు ప్లాట్లను చేసి అమ్మకం చేశారు. అంతేకాకుండా ఈ ప్లాట్లలోకి వచ్చే ప్రధాన ద్వారం వద్ద కళాతోరణం ఏర్పాటు చేశారు. ఈ భూమి కొనుగోలులో ఇన్వెస్టర్కు సంబంధించిన బయటి వ్యక్తి తల దూర్చాడు. అతను ప్లాట్ల హద్దురాలను, కళాతోరణంను అక్రమంగా కూల్చివేశాడు. ఈ విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు.. తాము కొనుగోలు చేసిన భూములలోనికి సంబంధం లేని వ్యక్తులు వచ్చి దౌర్జన్యంగా చొరబడి భూమి హద్దులను మార్చడమే కాకుండా, తోరణాన్ని కూల్చివేశారని బుధవారం ఆందోళన చేపట్టారు. దళారులు, దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ విషయం కాస్త పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళింది.తమ భూమిలోకి సంబంధం లేని వ్యక్తులు తలదూర్చి అక్రమంగా హద్దురాలను ధ్వంసం చేసిన వ్యక్తుల నుంచి తమ ప్లాట్లకు రక్షణ కల్పించాలి వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ప్రవీణ్, శేఖర్, సుజాత తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కురుమూర్తి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు



**టీ మీడియా ,అక్టోబర్ 24, చిన్నచింతకుంట :** మహబూబ్నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మపురం గ్రామంలో ఏడుకొండల లో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల రెండు నుండి ప్రారంభమవుతున్నాయి. కాంచన గృహ పై నిర్మించిన ప్రధానాలయం లక్ష్మీదేవి చెన్నకేశవస్వామి క్షేత్రపాలకులు ఆంజనేయస్వామి ఆలయాలకు రంగులు వేస్తున్నారు. ఈ సందర్భంగా జాతర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్వామివారి రాజగోపానికి , స్వామి వారి ప్రధాన ఆలయ రాజగోపురానికి, గర్భగుడి శిఖరానికి , ఆలయ ముఖద్వారాలకు రంగులు విద్యుత్ దీపాలంకరణ పనులు, పుష్కరిణికి తదితర గుల్లకు నామాలతో రంగులు వేశారు. కోనేరు శుద్ధి చేసి భక్తులకు స్నానం ఆచరించేందుకు నీళ్లు నింపారు. జాతరలో గుడారాలు నిలుస్తున్నాయి వ్యాపారస్తులు తమ దుకాణ స్థలాలు చదును చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్,కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రం నలు నలుమూలల నుండి భారీగా భక్తులు రానున్న సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. కురుమూర్తి స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్పీ జానకి తెలిపారు. దా లవ్ సవానికి లక్షల్లో వచ్చే భక్తులు స్వామివారి బంగారు ఆభరణాల ఊరేగింపునకు ప్రత్యేక బలగాలతో పాటు పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉన్నట్టు ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. దేవాదాయశాఖ దేవస్థానం పాలకవర్గం బాధ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఎంపీ ఓ అనిల్ కుమార్ తో కలిసి ఆలయ ఈవో మదిలేశ్వర్ రెడ్డి అర్చకులు వెంకటయ్య అనంత విజయ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించి జాతర పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

## ముఖ్యమంత్రిని బొందపెడతాం

- వర్గీకరణను అమలు చేయాలి
- కొమ్ము చెన్నకేశవులు మాదిగ



**టీ మీడియా, అక్టోబరు 24, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలో అన్ని మండల జిల్లా నాయకులు ఈ నెల 30న జడ్చర్ల జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభను మాదిగ ప్రజలు నిరుద్యోగులు మాదిగ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించి ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని. నమ్మించి డీఎస్సీ ఫలితాల్లో వర్గీకరణ అమలు పరచకుండా మాదిగ, ఉప కులాల విద్యార్థి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో వున్న గురువారం పాలిటెక్నిక్ కళాశాల జరిగిన వికలాంగుల హక్కుల పోరాట సమితి(వి హెచ్ పి ఎస్ ) నాయకులతో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరంగంధం గట్టయ్య మాదిగ,గట్టు స్వామి మాదిగ,మహాజన సోషలిస్టు పార్టీ (ఎం ఎస్ పి) వనపర్తి జిల్లా మాట్లాడుతూమాదిగ జాతిని నమ్మించి మోసగించిన రేవంత్ రెడ్డిని రాజకీయంగా బొంద పెడతామని. తక్షణమే విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశార కార్యక్రమంలోశ్రీనివాసులు ,చెన్నయ్య మాదిగ,అడ్డాకుల పవన్ , కళ్యాణ్ మాదిగ ,శరత్ మాదిగ,గంధం లక్ష్మయ్య ,గంధం కృష్ణయ్య సుర చంద్రశేఖర్, కుషా కుమార్ ,గంధం రాజు,అడ్డాకుల నాగరాజు మాదిగ , తదితరులుహాజరైనారు.

## బిజెపి సభ్యత్వ నమోదు

### -పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము



**టీ మీడియా, అక్టోబర్ 24, వనపర్తి బ్యూరో :** వనపర్తి బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో మర్రికుంట తొమ్మిదవ వార్డు ఆంజనేయస్వామి గుడి దగ్గర పూజ కార్యక్రమం అనంతరం సభ్యత్వ బిజెపి కార్యక్రమం మొదలుపెట్టుకొని ప్రారంభించడం జరిగింది. ప్రతి హోటల్ కాడ ప్రతి షాపు కాడ ప్రతి మెకానిక్ షాపుల దగ్గర పెద్ద ఎత్తున బిజెపి సభ్యత్వ నమోదు చేసుకోవడం జరుగుతుంది ప్రజలు సంతోషంగా చేసుకోవడం జరుగుతుంది. సభ్యత్వం లింకు లో కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారునికి వస్తాయని తెలియజేయడం జరిగింది. నరేంద్ర మోడీ దేశ ప్రధాని మూడోసారి అయిన తర్వాత చెప్పింది చేయడం పథకాలు ఇవ్వడం దాంట్లో భాగంగా వనపర్తిలో 3500 మంది పీఎం విశ్వకర్మ 18 కులవృత్తుల వారికి లక్ష రూపాయలు లోన్ ఇవ్వడం జరుగుతుంది. దాదాపు వందల మందికి లక్షల రూపాయలు లోను ఇవ్వడం జరిగింది బ్యాంకుల ద్వారా ఈ కార్యక్రమంలో వనపర్తి బిజెపి సభ్యత్వం ఇంచార్జ్ మున్నూరు రవీందర్ , వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షుడు నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించడం జరిగింది. రాష్ట్ర సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఏ సీతారాములు, రామన్ గౌడ్ , వెంకటేశ్వర రెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షుడు చాణిక్య, బిజెపి ప్రధాన కార్యదర్శి నవీన్ , అరవింద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి పద్మమ్మ, శివ , సుబ్రహ్మణ్యం పాల్గొనడం జరిగింది.

## జన్మదిన వేడుకలలో పాల్గొన్న మాజీ మంత్రి



**టీ మీడియా, అక్టోబరు 24, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా, పాన్గల్ మండలం పాన్గల్ గ్రామానికి చెందిన గడ్డం. కళావతి సుధాకర్ పుత్రిక లావికా సంవృతా మొదటి పుట్టిన రోజు వేడుకలు కె. ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ నందు జరిగాయి.బి.ఆర్.ఎస్ నాయకులు గడ్డం.మహేష్ ఆహ్వానం మేరకు ఈ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి చిన్నారిని ఆశీర్వదించి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంజన్ రెడ్డి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ ఉన్నారు.

## సోషల్ మీడియా సమావేశంలోదేవన్న యాదవ్



**టీ మీడియా, అక్టోబర్ 24, వనపర్తి బ్యూరో :** హైదరాబాద్ గాంధీభవన్ లో సమావేశ వేదికగా రాష్ట్ర స్థాయి తెలంగాణ సోషల్ మీడియా సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ చైర్మన్ సుప్రియా శ్రీనేట్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర టెలీ కమ్యూనికేషన్ చైర్మన్ మన్నే సతీష్ కుమార్, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెట్టేం నవీన్ ని మర్యాదపూర్వకంగా కలిసిన వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎం దేవన్న యాదవ్, వనపర్తి అసెంబ్లీ కోఆర్డినేటర్ ధ్యారాపోగు వెంకటేష్, పెద్దమందడి మండల కోఆర్డినేటర్ రాజు, రేవల్లి మండల కోఆర్డినేటర్ రామచందర్, గోపాల్పేట మండల కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ ఈ సమావేశానికి హాజరైనారు.

## మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు

### -షీ టీం అవగాహన సదస్సు



**టీ మీడియా,అక్టోబర్ 24,రామగుండం క్రైమ్:** రామగుండం సిపి ఆదేశాల మేరకు షీ టీం వారు మంచేరియల్ జిల్లా కేంద్రము నందు గల చెన్నయ్ షాపింగ్ నందు ఉద్యోగులకి గురువారం షీ టీమ్ అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించేది షి టీం కర్తవ్యం అని,పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి,మహిళలు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని,అలాగే సైబర్ నేరాల గురించి తెలిపారు.వచ్చిన ఫిర్యాదు పై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు.ఆకతాయిల నుండి మరి ఏ ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700 నెంబర్ సంప్రదించాలని కోరారు.అలాగే అత్యవసర సమయంలో డయల్ 100 కి ఫిర్యాదు చేయాలన్నారు,ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా షీ టీమ్ ఎస్.ఐ హైమ,సిబ్బంది కానిస్టేబుల్ శ్రావన్ కుమార్,సతీష్,మహిళా కానిస్టేబుల్ జ్యోతి, పాల్గొన్నారు.

## రైతు సదస్సు సన్నాహక సమావేశం

### -పాల్గొన్న వాకిటి శ్రీధర్



**టీ మీడియా, అక్టోబరు 24, వనపర్తి బ్యూరో :** గోపాల్ పేట మండల రైతాంగ ప్రజా నిరసన సదస్సు సన్నాహక సమావేశం గురువారం మండల పార్టీ అధ్యక్షులు బి.బాలరాజు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశములో పాల్గొన్న జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి రైతులను నట్టేట ముంచారు అని మిగతా వర్గాలకు ఇచ్చిన హామీలు కూడా అమలు చేయడం లేదని ప్రజలు చాలా ఆగ్రహంగా ఉన్నారు అని అన్నారు.ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాడడానికి మాజీ మంత్రి టి.హరీష్ రావు ముఖ్య అతిథిగా వనపర్తిలో రైతాంగ ప్రజా నిరసన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.మండల కమిటీ ప్రతి గ్రామాన్ని సందర్శించి రైతులను ప్రజలను సన్నద్ధం చేసి సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కురుమూర్తి యాదవ్, తిరుపతయ్య యాదవ్, చంద్రశేఖర్ ,మతీన్, మణ్యా నాయక్, వడ్డే.గోపాల్,హర్యా నాయక్,వద్దేమాన్.రవి,నాగరాజు,కాశినాథ్, జహంగీర్,బాల్ రెడ్డి,వేంకటేశ్వర రావు,గిరి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్



**టీ మీడియా, అక్టోబరు 24, వనపర్తి బ్యూరో :** గుండె సమస్యలు ఉన్న చిన్న పిల్లల కోసం అక్టోబర్ 26న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తెలిపారు.ఎన్.ఎం.డి.సీ లిమిటెడ్ వారి సౌజన్యంతో హృదయ ఫౌండేషన్, హైదారాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.వైద్య శిబిరంలో పిడియాట్రిక్ కార్డియాలజీ స్పెషలిస్ట్ లు అందుబాటులో ఉంటారని, 2డి ఎకో సేవలు సైతం పొందవచ్చని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు పాత రిపోర్టులతో పాటు, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు విధిగా తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9154289381 నెంబర్ ను సంప్రదించవచ్చని సూచించారు.

# కార్తీక మాసం ఏర్పాట్లపై సమావేశం ..

**-భక్తులకు అందుబాటులో మాస పరోక్ష అభిషేకం..**

**టీ మీడియా, అక్టోబర్ 24, మహానంది:**మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా నవంబర్ రెండవ తేదీ నుండి డిసెంబర్ ఒకటవ తేదీ వరకు మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కార్తీక మాస ఏర్పాట్లపై ఆలయ ఈవో దేవస్థానం కార్యాలయంలో ఆలయ అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేవిధంగా, తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చేపట్టవలసిన ఏర్పాట్లు అన్ని ముందస్తుగానే పూర్తి చేయాలని సూచించారు. కార్తీక మాసంలో ముఖ్యంగా కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి, బహుళ ఏకాదశి లు ప్రభుత్వ సెలవు దినాలు, లలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని,రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లను ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కోనేరులలో పవిత్ర స్నానాలు, మరుగుదొడ్లు , మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, శుభ్రంగావుంచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతేకాకుండా భక్తులకు రూ. 2000 రూపాయలతో కార్తీక మాస పరోక్ష అభిషేకం సేవలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



భక్తులు ఈ కార్తీకమాస పరోక్ష సేవ రుసుము చెల్లిస్తే, వారి గోత్రానామాలపైన కార్తీక మాసం నెల రోజులు, పరోక్ష అభిషేకం చేసి, వారికి ఆ మాసంలో ఒకరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి చిరునామాకు స్వామి వారి శేష వస్త్రం, స్వామి వారి ప్రసాదము అందజేస్తామన్నారు. కార్తీక మాసంలో క్షేత్రానికి వచ్చే భక్తులకు మంచినీటి సరఫరా, వసతి సౌకర్యవంతమైన దర్శనం స్వామి అమ్మవార్ల ఆర్జిత సేవలు ఆలయ వేళలు, క్యూలైన్ల నిర్వహణ రద్దీ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం, పార్కింగ్ కార్తీక సోమవారాలలో లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం, పుణ్య గంగా హారతి ఏర్పాట్లు కార్తీకమాసంలో ఆకాశదీపం ఏర్పాట్లు సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ మాసంలో సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు, దర్శనం ఏర్పాట్లు ఆర్జిత సేవలు, అన్న ప్రసాద వితరణ లడ్డు ప్రసాదాలు కోనేరు స్నానాలకు ఏర్పాట్లు, కేశఖండనశాలలో ఏర్పాట్లు సూచిక బోర్డులు ఈ మాసంలో శివసప్తహ భజనలు వంటి ఏర్పాట్లపై చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి,వేద పండితులు రవిశంకర అవధాని,ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగాతో

### -కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ భేటీ..



**టీ మీడియా, అక్టోబరు 24,న్యూఢిల్లీ :** అమెరికా వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల్లో సంస్కరణల సహా పలు అంశాలపై చర్చించారు. వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాల సందర్భంగా నిర్మలా సీతారామన్, అజయ్ బంగా ప్రపంచ పబ్లిక్ గూడ్స్ ప్రైవేట్ క్యాపిటల్ భాగస్వామ్యం, ఇంధన భద్రత, బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రపంచ బ్యాంక్ తరపున భారతదేశం జీ-20 ప్రెసిడెన్సీ సమయంలో బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణలపై ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ గ్రూప్ సిఫారసులపై సాధించిన పురోగతి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాన్నారు. భవిష్యత్తులో సిఫార్సుల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కోరారు. 2023 జీ-20 భారత్ ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో నియమించిన ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ గ్రూప్.. బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల సంస్కరణ కోసం సిఫారసులు చేసింది. పేదరికాన్ని అంతం చేయడం, భాగస్వామ్య శ్రేయస్సును ప్రోత్సహించడం, 2030 నాటికి ప్రపంచ ప్రజా వస్తువుల కోసం స్థిరమైన రుణస్థాయిలను మూడురెట్లు పెంచేందుకు దోహదం చేయాలని.. బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల ఎజెండాలోని అంశాలకు మద్దతు ఇచ్చేందుకు ఇష్టపడే పెట్టుబడిదారులతో ఉద్దేశపూర్వకంగా పాల్గొనేందుకు అనువైన, వినూత్నమైన ఏర్పాట్లను అనుమతించే మూడో ఫైనాన్సింగ్ మెకానిజం రూపొందించాలని సిఫారసు చేసింది. బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ 80వ వార్షికోత్సవం సందర్భంగా చర్చించేందుకు ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ సంయుక్తంగా నిర్వహించే కన్సల్టేటివ్ మెకానిజంపై విస్తృత సంప్రదింపుల ప్రక్రియ అవసరమని కేంద్రమంత్రి పేర్కొన్నారు

## ఒడిశా, పశ్చిమబెంగాల్‌లో భారీ వర్షాలు

**-అప్రమత్తమైన భారత నేవీ**



**టీ మీడియా, అక్టోబరు 24,న్యూఢిల్లీ :** బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీవ్ర తుపానుగా మారి ఒడిశా వైపు పయనిస్తోందని భారత వాతావరణ శాఖ గురువారం వెల్లడించింది. శుక్రవారం తెల్లవారుజామున తీరాన్ని తాకనుందని తెలిపింది. తుపాను ప్రభావంతో గురువారం ఉదయం నుండి ఒడిశా తీర ప్రాంతాలలో భారీ వర్షాలు, బలమైన గాలులు వీస్తున్నాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ తుపానుతో ప్రభుత్వం అప్రమత్తమైందని, డేంజర్ జోన్‌లో నివసిస్తున్న 3-4 లక్షల మంది ప్రజలను బుధవారం సాయంత్రానికి సురక్షితమైన ప్రదేశాలకు తరలించామని ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝీ పేర్కొన్నారు.ఒడిశాతో పాటు పశ్చిమబెంగాల్‌లోనూ గురువారం ఉదయం నుండి మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమబెంగాల్ దక్షిణ ప్రాంతంతో పాటు నార్త్ 24 పరగణాలు, సౌత్ 24 పరగాణాల జిల్లాలతో పాటు పశ్చిమ మేదినీపూర్, కోల్‌కతా, ఝర్‌గ్రామ్, హౌరా మరియు హుగ్లీ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.భారత నేవీ అవసరమైన మానవతా విపత్తు సహాయ (హెచ్ఎడిఆర్) కార్యకలాపాలను నిర్వహించేందుకు సన్నద్ధమైంది. రెండు నేవీ బోట్లను కూడా సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయానికి భిటర్ కనిక నేషనల్ పార్క్ - ధామ్రా పోర్ట్‌ల మధ్య దానా తుపాన్ తీరం దాటనుందని ఐఎండి అంచనావేసింది.

## ఏసీబీ వలలో పీఆర్ ఈఈ

### రూ. 20,000 లంచం తీసుకుంటుండగా పట్టివేత




**టీ మీడియా, అక్టోబరు 24,భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం ఏసీబీ రైడ్ జరిగింది. భూపాలపల్లి పంచాయతీ రాజ్ ఈఈ దిలీప్ లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. రోడ్డు పనుల బిల్లు మంజూరు కోసం కాంట్రాక్టర్ వద్ద లంచం డిమాండ్ చేశారు.రూ.20వేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఇంకా పంచాయతీరాజ్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి.

## మున్సిపల్ దుకాణాలకు వేలం



**టీ మీడియా, అక్టోబరు 24,ఆదిలాబాద్ :**మున్సిపల్ అధికార యంత్రాంగం ఆదాయ వనరులు పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించింది. పట్టణంలో పురపాలకశాఖకు చెందిన 17 దుకాణాలను అద్దె (కిరాయి) ప్రాతిపదికన అప్పగించేందుకు వేలంపాట నిర్వహించాలని నిర్ణయించారు. వినాయక్ చౌక్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలో 14, పాత బస్టాండ్ ప్రాంతంలో రెండు, శివాజీచౌక్ లో ఒక దుకాణాలను వేలం వేసేందుకు యంత్రాంగం సిద్ధమయ్యింది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో దీనిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు బల్దియా కార్యాలయంలో బిడ్డర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.. వచ్చె నెల నవంబర్ 2న మున్సిపల్ కార్యాలయంలో ఈ వేలంపాటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపారపరంగా డిమాండ్ ఉన్న ప్రాంతంలో షాపులు ఉండటంతో బిడ్డర్ల నుంచి భారీగా స్పందన వస్తోందని, అధిక ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంచ వేశమన్నారు. ఈ వేలంపాటను నెలవారీ అద్దె ధరపై కాకుండా ధరావతుపై నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి దుకాణానికి కనీస ధరావతు ధర రూ. 50 వేలుగా నిర్ణయించినట్లు, అంతేకాకుండా వేలంపాటకు రిజర్వేషన్ పద్ధతిని సైతం అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నామని పేర్కొన్నారు. వేలం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని, వ్యాపారాలు చేయాలనుకునే ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని బల్దియా అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ ఈ మేరకు ఒక ప్రకటనలో కోరారు.

## ట్రిపుల్ ఐటీ బాసరకు హై కోర్టు నోటీసులు..!



**టీ మీడియా, అక్టోబరు 24,ముధోల్ :** ట్రిపుల్ ఐటీ బాసరలో విద్యను అభ్యసించి బయటకు వచ్చిన విద్యార్థులకు సంబంధించిన ఫీజులు ప్రభుత్వం చెల్లించినందుకు త్రిబుల్ ఐటీ యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తుంది అని ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి సామల ఫణి కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ ఒక్క విద్యార్థి కాదు వేల మంది విద్యార్థులకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుందని, వాస్తవానికి ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన వాళ్లంతా ఉచిత విద్యను అభ్యసించడానికి హక్కు ఉందని, దానికి సంబంధించిన పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలని, పిటీషనరు విద్యార్థి తరపున హైకోర్టు న్యాయవాది తక్కురి చందన వాదనలు వినిపించారు. దీంతోతెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కి, ట్రిపుల్ ఐటీ యాజమాన్యానికి హైకోర్టు నోటీసులు జారీ చేసిందని పిటిషనర్ నవతెలంగాణ ఫోన్ లో గురువారం తెలిపారు .

## కొత్త రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోడీతో

# శంకుస్థాపన చేయిస్తాం

**-ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**



**టీ మీడియా, అక్టోబరు 24, అమరావతి:** రైల్వేలైనుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి రైల్వే కనెక్టివిటీ వల్ల దేశంలోని అన్ని రాజధానులను అనుసంధానం చేసేందుకు వీలుగా కలుగుతుందని అభిప్రాయపడ్డారు.సీఎం చంద్రబాబు ఆన్ లైన్ లో కేంద్రం మంత్రులు అశ్వనీ వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురంధ్వేరితో మాట్లాడారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'అమరావతి రైల్వే లైన్ కు ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రిమండలికి ధన్యవాదాలు తెలుపుతున్నా. అమరావతికి ఈ రైల్వే లైను వేయడం వల్ల దేశంలోని అన్ని రాజధాని నగరాలకు అనుసంధానంగా ఉంటుంది. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కలకత్తా నగరాలను ఈ రైల్వేప్రాజెక్టు కలుపుతుంది. రూ. 2,245 కోట్లతో 57 కి.మీ. మేర చేపట్టనున్న ఈ ప్రాజెక్టును 3 ఏళ్లలో పూర్తి చేస్తే మరింత ఉపయోగపడుతుందని కోరుతున్నా. కృష్ణానదిపై నిర్మించే 3.2 కిమీ రైల్వే వంతెనను ఐకానిక్ బ్రిడ్జిగా మార్చాలని కోరుతున్నా. దేశంలోనే అమరావతి వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు బెస్ట్ సిటీగా ఉంటుంది. రాజధాని నిర్మాణానికి కేంద్రం కూడా వివిధ మార్గాల్లో సాయం అందిస్తోంది.

ఈ లైను నిర్మాణంలో భాగంగా 25 లక్షల చెట్లను నాటడం ద్వారా కార్బన్ డై ఆక్సైడ్ నివారించవచ్చు. రాష్ట్రంలో రూ.72 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఎప్పటి నుండో పెండింగులో ఉన్న రైల్వే జోన్ సమస్యను కూడా పరిష్కరించుకున్నాం అని తెలిపారు.వచ్చే నెల లేదా డిసెంబరులో మంచి ముహూర్తం చూసి రైల్వే జోన్ కు ప్రధాని మోదీతో శంకుస్థాపన కూడా చేయిస్తాం. ఇతర రైల్వే స్టేషన్లలో కూడా ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి.రాష్ట్రం నుండి ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ కూడా తగిన సమయంలోనే అందిస్తాం. 10 రోజుల క్రితమే ఢిల్లీలో పర్యటించినప్పుడు అమరావతి రైల్వే కనెక్టివిటీ గురించి ప్రధాని మోదీతో మాట్లాడాను ఇంత తక్కువ సమయంలో కేబినెట్ ఆమోదించడం సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం.' అని అన్నారు.

## రాష్ట్రానికి ఈ రైల్వే లైన్ ఎంతో అవసరం

**డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్**



**టీ మీడియా, అక్టోబరు 24,అమరావతి:** మొత్తం 57 కిలోమీటర్ల మేర రూ.2,245 కోట్ల వ్యయంతో అమరావతి అనుసంధాన రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా ఊపడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధి కోణంలోంచి చూస్తే అమరావతి రైల్వే లైన్ ఎంతో అవసరం అని అన్నారు.అమరావతి రైల్వే కనెక్టివిటీ లైన్ కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. ఈప్రాజెక్టును పూర్తి చేయడానికి నాలుగేళ్ల సమయం పడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల మేర బ్రిడ్జి కూడా నిర్మాణం జరుపుకుంటుందని, ఈ కొత్త రైల్వే లైన్ పూర్తయితే అమరావతికి దేశంలోని అన్ని ప్రధాన నగరాలతో కనెక్టివిటీ ఏర్పడుతుందని పవన్ కల్యాణ్ వివరించారు.ఇది ఏపీ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఊతమిస్తుందని పేర్కొన్నారు. మచిలీపట్నం-కృష్ణపట్నం-కాకినాడ పోర్టులను కూడాఅనుసంధానం చేసేలా ఈ ప్రాజెక్టు తీసుకురావడం హర్షణీయమని అన్నారు.

## విజయం సాధించడమే లక్ష్యం -అఖిలేష్ యాదవ్



**టీ మీడియా, అక్టోబరు 24,ఉత్తరప్రదేశ్ :**లో తొమ్మిది స్థానాలకు త్వరలో జరుగనున్న ఉప ఎన్నికల్లో 'ఇండియా' బ్లాక్ అభ్యర్థులంతా 'సైకిల్' గుర్తుపై పోటీ చేస్తారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడమే కూటమి లక్ష్యమని చెప్పారు. అయితే సీట్ల పంపకం ఇంకా ఖరారు కాలేదని అన్నారు. 'కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు ఐక్యంగా ఉన్నాయి. ఒక పెద్ద విజయం కోసం భుజం భుజం కలిపాయి. ఈ ఉప ఎన్నికల్లో ఘన విజయంతో 'ఇండియా' బ్లాక్ కొత్త చరిత్ర సృష్టిస్తుంది. అపూర్వమైన సహకారం, మద్దతుతో మొత్తం 9 అసెంబ్లీ సీట్లలో గెలవాలనే సంకల్పం, శక్తి ప్రతి 'ఇండియా' బ్లాక్ కార్యకర్తలో నిండి ఉంది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశ రాజ్యాంగం, శాంతి భద్రతలు, వెనుకబడినవారు, దళితులు, మైనారిటీల గౌరవం కోసం ఈ ఎన్నికల్లో పోరాడుతున్నట్లు అందులో పేర్కొన్నారు.

## పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

**-డిఎల్పీఓ ధర్మారాణి**



**టీ మీడియా, అక్టోబరు 24,జన్నారం :**గ్రామాలలో పారిశుధ్యంపై అలసత్వం వైస్త్య చర్యలు తప్పవని, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని డిఎల్పీఓ ధర్మారాణి అన్నారు. గురువారం మండలంలోని రెండ్లగూడా గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. బోర్వెల్ల దగ్గర బావుల దగ్గర మురుగునీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న నర్సరీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాము

**-ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో సీఎం సమావేశం**






**టీ మీడియా,అక్టోబర్ 24,హైదరాబాద్ బ్యూరో :** ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు గారితో కలిసి సీఎంసమావేశమయ్యారు.ఉద్యోగుల డీఏ చెల్లింపు విషయంపై శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.ఉద్యోగులకు సంబంధించి వివిధ సమస్యల పరిశీలన కోసం కేబినేట్ సబ్ కమిటీని నియమించారు.ఉప ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారు సభ్యులుగా కేశవరావు గారు ప్రత్యేక ఆహ్వానితులుగా కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు.దీపావళి తర్వాత శాఖల వారిగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కేబినేట్ సబ్ కమిటీ సమావేశమవుతుంది.

జీవో 317 పై మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే సమర్పించిన నివేదికపై కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు.జేఏసీ ప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణాలకు

# ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

**-జీహెచ్ఎంసీ కమిషనర్**



**టీ మీడియా, అక్టోబరు 24,హైదరాబాద్:** నగరంలో దీపావళి పండగకు బాణసంచా విక్రయించే దుకాణాదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. రిటైల్ దుకాణాలకు రూ.11 వేలు, హెూల్ సేల్ దుకాణాలకు రూ.66 వేలు లైసెన్స్ ఫీజు నిర్ణయించినట్లు కమిషనర్ ప్రకటించారు. బాణ సంచా దుకాణాలను ఫుట్‌పాత్‌లు, జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దని సూచించారు. అదేవిధంగా స్టాల్స్‌కు ఏర్పాటు చేసే విద్యుత్‌కు సంబంధించి నాణ్యమైన పరికరాలు ఉపయోగించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే అందుకు దుకాణాల యజమానులే బాధ్యత వహించాలని కమిషనర్ తెలిపారు. కాలనీలు, బస్తీలకు దూరంగా మైదానాలు, పెద్ద హాల్స్‌లో తగిన ఫైర్ సేఫ్టీతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి స్టాల్ వద్ద చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారంతా నిర్ణీత ఫీజును చెల్లించి జీహెచ్ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు.

## నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించండి

**-చాడ వెంకటరెడ్డి వినతి**



**టీ మీడియా, అక్టోబరు 24,హుస్నాబాద్ :**గౌరవెల్లి ప్రాజెక్టు ముంపు గురైన భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని గురువారం తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్య సలహాదారు ఆదిత్య నాథ్ దాస్,ఈ.ఎన్.సి అనిల్ కుమార్ కు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి గౌరవెల్లి ముంపు బాధితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిర్వాసితులకు పరిహారం వెంటనే ఇప్పించి ప్రభుత్వం అన్నివిధాల అందుకొని బాధితులు న్యాయం చేయాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గౌరవెల్లి ప్రాజెక్టు ముంపుకు గురైన భూ నిర్వాసితులకు అన్యాయం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో 18 ఏండ్లు నిండిన యువతులకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని, చట్టపరంగా నిర్వాసితులకు రావాల్సిన పరిహారం వసతులు వెంటనే కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ్మా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, మాజీ జెడ్పీటిసి అందే స్వామి, సిపిఐ మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ముద్రకొల రాజయ్య, బొయిని భాస్కర్, బద్దం ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మార్కెటింగ్‌లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్ పని చేయుటకు కావలెను

టీ మీడియా లోని ప్రింట్ /ఈ పేపర్ /పెళ్లి పందిరి /ఆన్లైన్ విభాగం /ఎలక్ట్రానిక్ విభాగం ల లో (టోటల్ తెలుగు మీడియా) మార్కెటింగ్ లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్.. (30నుండి 40శాతం )కమిషన్ బేసిక్ పై పని చేయూటకు ఆసక్తి ఉన్నవారు 8500515365 కి పంపగలరు. అవసరం అయిన శిక్షణ ఇస్తాము. నెలకు కనీసం గా రు 20వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

తమ వివరాలు :

పేరు :............................................................

ప్రస్తుత నివాసం :..............................చదువు :..............................

సెల్ నెంబర్ :............................................................